క్లుప్తంగా

నెట్టికంటుడి సన్నిధిలో ఆర్థిక మంత్రి



స్వామివారిని దర్శించుకుంటున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

గుంతకల్లు రూరల్: రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బుధవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా వేకువజామునే ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ ఈఓ కే.వాణి, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలతోపాటు, శేష వస్త్రాలను అందజేశారు.

ఎస్టీయూ క్యాలెండర్, డైరీ విడుదల



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయ సంఘం నేతలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో బుధవారం ఎస్టీయూ క్యాలెండర్, డైరీని ఎంఈఓలు నవీద, లింగా నాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘం నేతలు ఉపాధ్యాయల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలన్నారు. సమగ్రశిక్ష కింద పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఎంటీఎస్ వర్తింపజేయాలన్నారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతి, మండలాధ్యక్షుడు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు ప్రసాద్, మృత్యుంజయ, లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, సుంకన్న, పద్మావతి, లక్ష్మిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, వన్నప్ప, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగి బైక్ చోరీ

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే క్వార్టర్స్‌లో సుభాష్ అనే రైల్వే ఉద్యోగికి చెందిన పల్సర్ బైక్ బుధవారం చోరీకి గురైంది. ఇంటి కాంపౌండ్‌లో ఉంచిన బైక్‌ను దొంగ ఎత్తుకెళ్లాడు. ఈ ఘటనపై బాధితుడు సుభాష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గొంతు తడిసేదెన్నడు?

- కలగానే రక్షిత మంచినీటి పథకం • పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- మిడ్ పెన్నార్ డ్యాంలో రూ.40 కోట్లతో మంచినీటి పథకం
- వైఎస్సార్‌సీపీ హయాంలో పైపులైన్ పనులు పూర్తి • ప్రజలకు తప్పని నిరీక్షణ



డ్యాం నుంచి కల్లూరు వరకు ఏర్పాటు చేసిన పైపు లైన్

గార్లదిన్నె: మిడ్ పెన్నార్ డ్యాం వద్ద తలపెట్టిన రక్షిత మంచినీటి పథకం నిర్మాణం కలగానే మారింది. దీంతో పథకం ఎప్పుడు పూర్తయి తమ గొంతులు తడుస్తాయోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో గార్లదిన్నె మండలం మిడ్ పెన్నార్ డ్యాం నుంచి రక్షిత మంచినీటి పథకం(సీపీడబ్ల్యూఎస్) ద్వారా శింగనమల నియోజకవర్గంలోని ప్రజలకు తాగునీరు అందించాలని ఉద్దేశంతో అప్పట్లో రూ.40 కోట్లతో రక్షిత మంచినీటి పథకం ప్రారంభించారు. తర్వాత పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. దీంతో పథకం కలగా మారిపోయింది.

గత ప్రభుత్వంలో చురుగ్గా పనులు..

వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిడ్‌పెన్నార్ డ్యాం మీద ఇన్‌టేక్ వెల్, వాటర్ ఫిల్టర్, పంపు హౌస్, క్లినికల్ హౌస్ వంటి పనులు వేగవంత చేశారు. అలాగే ఇన్‌టేక్ వెల్ నుంచి పైపు లైన్ మండలంలోని కల్లూరు గ్రామంలో కొండ కింద కొట్టాల వద్ద ఉన్న సత్యసాయి పైపులైన్‌లోకి కలిపారు. అక్కడి నుంచి మండలంలోని వివిధ గ్రామాలకు తాగునీరు అందించాలనేది లక్ష్యం. ఇందులో భాగంగా అధికారులు దాదాపు 38 కిలో మీటర్లు పైపులైన్ పనులు పూర్తి చేశారు. ఇప్పటి వరకు ముంటిమడుగు గ్రామం వరకు పైపులైన్ పనులు జరిగాయి. వైఎస్సార్ ప్రభుత్వంలో వేసవిలో నీరు అందించాలని ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదు.

మండలంలో 24 గ్రామాలకు తాగునీరు..

తాగునీటి పథకం పూర్తయితే గార్లదిన్నె మండలంలోని 24 గ్రామాలకు తాగునీరు అందనుంది. వేసవి కాలం వచ్చిందంటే కనంపల్లి, పాపినేపాళ్యం, మర్తాడు, కోటంక, యర్రగుంట్ల, కమలాపురం, శిరివరం, ముకుందాపురం, బూదేడు గ్రామాల్లో ప్రజలు నీటికోసం తీవ్ర ఇబ్బందులు పడేవారు. తాగునీటి పథకం ద్వారా నీరు అందిస్తే వేసవిలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఉండవని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

తీరనున్న నియోజకవర్గ ప్రజల దాహార్తి

తాగునీటి పథకం పూర్తయితే నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజలకు తాగునీరు కష్టాలు తొలగి దాహార్తి తీరనుంది. దశాబ్దాలుగా శింగనమల నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి. వేసవికాలం వస్తే గార్లదిన్నె, శింగనమల, నార్పల, మండలాల్లో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మిడ్ పెన్నార్ డ్యాంలో పైపు లైన్ పనులు పూర్తి కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఇంత వరకు తాగునీటి పథకం గురించి పట్టించుకోలేదు. మంచినీటి పథకం ప్రారంభమైతే మొదటి విడతలో గార్లదిన్నె మండలం రెండవ విడతలో శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, మండలాల్లో ప్రజలకు మంచి నీరు సరఫరా చేస్తారు. అలాగే పుట్లూరు, యల్లనూరు మండల ప్రజలకు గండికోట నుంచి మంచి నీరు అందించనున్నారు.

తాగునీటి సమస్య ఉండదు



వేసవి కాలంలో తాగునీటి కోసం పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. గతంలో ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేశారు. కొన్ని సార్లు వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి నీరు తెచ్చుకునేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో డ్యాంలో తాగునీటి పథకం ద్వారా పైపులైన్ పనులు పూర్తి చేశారు. ఇప్పటికీ కూటమి ప్రభుత్వం తాగునీటి పథకాన్ని పట్టించుకోలేదు. పథకం పూర్తయితే తాగునీటి కష్టాలు తొలగిపోతాయి.

– నాగేంద్ర ,కమలాపురం

శుద్ధజలం అందిస్తే ఉపయోగం



మిడ్ పెన్నార్ డ్యాంలో తాగునీటి పథకం ద్వారా మండల ప్రజలకు శుద్ధజలం అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. చాలా కాలంగా గ్రామాల్లో నీటి సమస్యతో ఇబ్బంది పడ్డారు. కానీ రక్షిత మంచి నీటి పథకం ద్వారా ప్రతి ఇంటికీ నీరు అందించాలి. వేసవిలో కూడా నీటి సమస్య తలెత్తే ప్రసక్తే ఉండదు.

– వెంకటశివారెడ్డి, తిమ్మంపేట

సామాజిక తనిఖీ పక్కాగా చేపట్టండి



మాట్లాడుతున్న ఎంపీపీ బీవీ మాధవి

గుంతకల్లు రూరల్: మండలంలో 17వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ పక్కాగా చేపట్టాలని ఎంపీపీ బీవీ మాధవి తనిఖీల బృందం సభ్యులకు సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీల బృందం సిబ్బందితోపాటు, వివిధ శాఖల అధికారులు, ఆయా శాఖల సిబ్బందితో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటించే సామాజిక తనిఖీల బృందం పనులను నిశితంగా పరిశీలించి నివేదికలను సిద్ధం చేయాలన్నారు. ఉపాధిహామీ సిబ్బంది వారికి అందుబాటులో ఉండాలని సూచించారు. మండలంలో దాదాపు 10 రోజుల పాటు తనిఖీలు జరుగుతాయని త్వరలోనే ప్రజా వేదిక తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఈవోఆర్డీ నాగభూషణం, వివిధ శాఖల అధికారులు, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భీమ్ కొరేగావ్ అమరవీరులను మరవొద్దు

గార్లదిన్నె: దేశ చరిత్రలో భీమ్ కొరేగావ్ పోరాట విజయాన్ని, మహవీర్ అమరవీరులను మరవరాదని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్లాయప్ప పేర్కొన్నారు. బుధవారం ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సర్కిల్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద భీమ్ కొరేగావ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కుళ్లాయప్ప మాట్లాడుతూ 1818 జనవరి 1న జరిగిన యుద్ధంలో 28 వేల మంది పీష్వా సైనికులను 5 వేల మంది మహార్‌వీరులను మట్టి కరిపించారన్నారు. అలాంటి వీరులను ప్రతి దళితుడు స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, నాగరాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

గుత్తి కోటను సందర్శించిన ఇంగ్లాండ్ దేశీయులు



గుత్తి కోటను సందర్శించిన ఇంగ్లాండ్ దేశీయులు

గుత్తి: చరిత్రాత్మక గుత్తి కోటను బుధవారం ఇంగ్లాండ్ దేశీయులు సందర్శించారు. ఇంగ్లాండ్ దేశానికి చెందిన లిజీ ఎలిజబెత్, క్రిష్టఫర్ కోటలోని ఏనుగు శాలలు, గుర్రపు శాలలు, బావులు, రంగ మంటపం, చీకటి గదులు తదితర వాటిని పరిశీలించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, గైడ్ రమేష్ గుత్తి కోట చరిత్రను వారికి వివరించారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో బుధవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని అయ్యప్ప మాలదారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యాక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

యూటీఎఫ్ క్యాలెండర్ విడుదల

తాడిపత్రిటౌన్: పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం యూటీఎఫ్ 2025 డైరీ, క్యాలెండర్‌ను డీఎస్పీ రామక్రిష్ణుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ తాను టీచర్‌గా పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. అనంతరం యూటీఎఫ్ నాయకులు ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సూర్యనారాయణ, సుంకన్న, శ్రీరాములు, చెన్నారెడ్డి, జిల్లా కార్యదర్శి రాముడు, హరినారాయణ, హటీ, సుధాకర్‌రెడ్డి, బాలక్రిష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

చింతల ఆలయానికి 'నూతన' శోభ



ముస్తాబైన చింతల రమణుడి ఆలయం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని చింతల వేంకటరమణ స్వామి ఆలయం నూతన శోభను సంతరించుకుంది. నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో వేంకటరమణస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



వీరాంజనేయులు, ఆలూరు సాంబశివారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు



మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌ను శాలువాతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు, కార్యకర్తలు

శింగనమల: నూతన సంవత్సర వేడుకలను అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, ప్రభుత్వ విద్య మాజీ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, ప్రభుత్వ విద్యా మాజీ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ గత అనుభవాలను నెమరువేసుకుంటూ పొరపాట్లకు తావులేకుండా నూతన ఆలోచనలతో ప్రజలు ముందుకెళ్లాలన్నారు. ప్రజలు సుఖ సంతోషాలు, సిరిసంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఎంపీపీలు వెంకటనారాయణ, నాగేశ్వరరావు, జడ్పీటీసీ భోగాతి ప్రతాప్‌రెడ్డి, మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొద్దిరోజుల క్రితం శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి హైదరాబాద్‌లోనే ఉంటూ అక్కడే చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని గుంతకల్లు వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, సోమిరెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు వైవీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అనంతరం నూతన సంవత్సర కేక్‌ను కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు.

గుంతకల్లు టౌన్: నూతన సంవత్సర వేడుకలు గుంతకల్లులో బుధవారం ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, డీఎస్పీ శ్రీనివాస్ తదితర అధికారుల నివాసాల వద్ద సందడి నెలకొంది. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి, పాత గుంతకల్లు శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీకన్యకాపరమేశ్వరి, దుర్గాభవాని, అయ్యప్ప స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా బుధవారం నూతన సంవత్సర వేడుకలు సంబరాలు అంబరాన్నంటాయి. యువకులు బైక్‌లలో తిరుగుతూ కనిపించిన ప్రతి ఒక్కరికీ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. శ్రీపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు మల్లయ్యయాదవ్, సునీల స్వగృహంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తొండపాడు శ్రీ బొలికొండ రంగనాథ స్వామి, బాచుపల్లి బాట సుంకలమ్మ, సేవాగఢ్‌లోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో యువకులు, విద్యార్థులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా బుధవారం నూతన సంవత్సర వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్ర రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి నివాసంలో పలువురు నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పూలమాలలు గజ మాలలు, బొకేలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

యాడికి: మండలంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు దంపతులను, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమా లలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు ఇంటిలో భోగాల కట్ట గ్రామంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకట రామిరెడ్డిని నాయకులు, కార్యకర్తలు పూల మాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపీపీ చెన్నప్ప, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని ఐఎస్ఈసీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేట శివాలయం, చెన్న కేశవస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కాశిరెడ్డి నాయన ఆలయం వద్ద గ్రామ పెద్దలు పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు.

తాడిపత్రిటౌన్: నూతన సంవత్సర వేడుకలు పట్టణంలో బుధవారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదల రమేష్‌రెడ్డి, ఆ పార్టీ ముఖ్యనేత కౌన్సలర్ ఫయాజ్‌బాషాకు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పలువురు వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే డీఎస్పీ రామకృష్ణుడుని పలువురు సంఘంల నాయకులు, సీఐలు శివగంగాధర్‌రెడ్డి, రామసుబ్బయ్య, ఈరన్న, ఎస్ఐలు ధరణిబాబు, కాటయ్య, గౌస్‌బాషా, నాగేంద్ర ప్రసాద్, రమణ, ఆంజనేయులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గుత్తి: ప్రతి ఒక్కరూ ఏసు ప్రభువుపై విశ్వాసం కలిగి ఉండాలని డివిజనల్ చైర్మన్, పాస్టర్ రెవరెండ్ డేవిడ్ నాయక్ అన్నారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని సీఎస్ఐ చర్చిలో బుధవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని టెన్నిస్ కోర్టులో కోచ్ గ్లాడ్‌స్టోన్, సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నూతన సంవత్సరం వేడుకలను నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శామ్యూల్ సీఐను సన్మానించారు. ఇదిలా ఉండగా గుత్తిలోని కాశీ విశ్వేశ్వరాలయం, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, నగరేశ్వరాలయం, ఆర్‌ఎస్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం, గౌతమేశ్వరాలయాలు భక్తులతో నిండిపోయాయి.

పామిడి : పట్టణంలోని అన్ని చర్చిల్లో బుధవారం నూతన సంవత్సర ఆరాధన ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. చర్చి సెక్రెటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

నార్పల: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి ఇంట్లో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన అభిమానులు,కార్యకర్తలు కేకులు కట్ చేశారు. సర్పంచు మన్నీల సుప్రియ, ఎంపీపీ నాగేశ్వరావు, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, మాజీ సర్పంచు ఖాదర్‌వలిఖాన్, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ అమీర్, మాజీ కో ఆప్షన్ మెంబర్ దాడితోట బాష,గుత్తి గోపాల్‌రెడ్డి, గొళ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.